క్లుప్తంగా

సాక్షి గణపతికి విశేష పూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో లోకకల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షి గణపతి స్వామికి అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలా వీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు. సాక్షి గణపతి స్వామికి పంచామృతాలతోను, ఫలోదకాలతోను, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోదకం, శుద్ధజలంతో అభిషేకం చేసి విశేష పుష్పార్చన, నివేదన కార్యక్రమాలను చేపట్టారు. అలాగే జ్వాలా వీరభద్రస్వామివారికి అభిషేకం, విశేష పుష్పార్చన జరిపించారు.

వైభవంగా రథోత్సవం



రథోత్సవ వేడుకల్లో పాల్గొన్న భక్తులు

నందికొట్కూరు: కొణిదేల గ్రామంలో శ్రీమత్కొణిదేల భ్రమరాంబ మల్లికార్జునస్వామి వార్ల రథోత్సవం బుధవారం సాయంత్రం వైభవంగా సాగింది. నాగటూరు, బిజినవేముల, నెహ్రూనగర్ తదితర చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి రథోత్సవాన్ని తిలకించారు.

వేతనాలు మంజూరు చేయాలి



ఎంఈఓకు వినతి పత్రం అందజేస్తున్న మధ్యాహ్న భోజన నిర్వాహకులు

ఆత్మకూరు: పెండింగ్‌లో ఉన్న వేతనాలను మంజూరు చేయాలని మధ్యాహ్న భోజన నిర్వాహకులు మల్లీశ్వరి, లక్ష్మీదేవి, సీఐటీయూ పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్ కోరారు. బుధవారం వారు ఎంఈఓ బాలాజీనాయక్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన నిర్వాహకులు ప్రభావతి, ఈశ్వరమ్మ, రమిజాబీ, మరియమ్మ, మంజుబాయి తదితరులు పాల్గొన్నారు.


మహిళ ఆత్మహత్య

బండి ఆత్మకూరు: మండల పరిధిలోని సంతజూటూరు గ్రామానికి చెందిన కృష్ణవేణి (40) బుధవారం ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్‌ఐ జగన్‌మోహన్ తెలిపిన వివరాలు.. వడ్డే నాగరాజు, కృష్ణవేణి దంపతులకు కూతురు, కొడుకు ఉన్నారు. బుధవారం ఉదయం కృష్ణవేణి కడుపునొప్పి తాళలేక కల్లాపి పొడి తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ కోలుకోలేక మృతిచెందింది. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

జూపాడుబంగ్లా: రజకులను ఎస్సీ జాబితాలో చేర్చి ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో రాణించేలా దోహదపడాలని రజక సంక్షేమ సంఘం రాష్ట్ర మాజీ నాయకుడు బస్తిపాటి మౌలాలి, మండల అధ్యక్షుడు రామాంజనేయులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఐలమ్మ విగ్రహం వద్ద వారు మాట్లాడుతూ రజకులు కొన్ని రాష్ట్రాల్లో ఎస్సీలుగా, మరికొన్ని రాష్ట్రాల్లో బీసీలుగా కొనసాగించటం సమంజసంగా లేదన్నారు. దేశవ్యాప్తంగా రజకులందరూ ఒకే గొడుగు కిందకు చేర్చేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రజకుల సమస్యల పరిష్కారార్థమై ఈనెల 14న రాష్ట్ర రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి ఆధ్వర్యంలో ఐక్యకార్యాచరణ రూపొందిస్తామన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాల్లోని రజకులు భారీ సంఖ్యలో తరలిరావాలని వారు కోరారు.

మేట్‌లకు శిక్షణా తరగతులు



మాట్లాడుతున్న కోర్స్ డైరెక్టర్ జేసుదాసు

పాములపాడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ భవనంలో బుధవారం మేట్‌లకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఉపాధి పనుల వద్ద కొలతలు తీసుకునే విధానం, మస్టర్ నిర్వహణ, పని డిమాండ్, జాబ్ కార్డు అప్‌డేషన్, ఎస్ఎంఎంఎస్ అటెండెన్స్‌లపై కోర్సు డైరెక్టర్ జేసుదాసు వివరించారు. కార్యక్రమంలో ఏపీఓ విమలమ్మ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రజల పక్షం

- ఘనంగా ఆవిర్భావ దినోత్సవం
- పార్టీ జెండా ఆవిష్కరించి సంబరాలు చేసుకున్న నాయకులు, కార్యకర్తలు



వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పార్టీ శ్రేణులు

ఆత్మకూరు: వైఎస్సార్‌సీపీ ప్రజల పక్షమని ఆ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు రాజమోహన్‌రెడ్డి, సయ్యద్‌మీర్ తెలిపారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండాను ఎగురవేసి, సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 15 ఏళ్ల క్రితం ఇడుపులపాయలో వైఎస్సార్ సీపీని ప్రారంభించారన్నారు. అప్పటి నుంచి పేదల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. అధికారంలో ఉన్న గత ఐదేళ్లలో కూడా ప్రజల కోసమే ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో పేదలను విస్మరించిందన్నారు. ఎన్నో హామీలిచ్చి అధికారం చేపట్టిన తర్వాత అన్ని వర్గాలను మోసం చేశారన్నారు. ప్రజలు తొమ్మిది నెలలకే ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేక వ్యక్తం చేస్తున్నారని రాబోయే రోజుల్లో కచ్చితంగా వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తుందని జోస్యం చెప్పారు. అంతకముందు పార్టీ కార్యాలయం నుంచి పార్టీ కార్యకర్తలు వైఎస్ఆర్ విగ్రహం వద్దకు చేరుకుని పాలాభిషేకం చేసి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పార్వతి, దర్గమ్మ, షఫీవున్, కరిముల్లా, రంగస్వామి, మూర్తుజా, రాజగోపాల్, ముమీన్, మున్నీర్‌బాషా, బైరాపురం షేక్‌మహబూబ్‌బాషా, లక్ష్మిరెడ్డి, పుల్లారెడ్డి, ప్రకాశం, రవిబాబు, రమేష్, రాజేష్, శాలు, మరియమ్మ, షంషూర్, రవినాయక్ పాల్గొన్నారు.

బండి ఆత్మకూరులో..



వైఎస్ఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

బండి ఆత్మకూరు: మండల కేంద్రంలో బుధవారం వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ దేరెడ్డి చిన్నసంజీవరెడ్డి, మాజీ ఎంపీపీ దేసు వెంకటరామిరెడ్డి హాజరై పార్టీ జెండాను ఆవిష్కరించారు. దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వెలుగోడులో..



వెలుగోడు: మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని వైఎస్సార్ విగ్రహానికి పార్టీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ఇలియాస్ ఖాన్, ఎంపీపీ లాలం రమేష్, సర్పంచ్ వేల్పుల జయపాల్, జిల్లా నాయకులు దేశం తిరిపం రెడ్డి, కాసారపు రామ్మోహన్ రెడ్డి, తెలుగు రమణ, షంషీర్ అలీ పాల్గొన్నారు.

వైఎస్ఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్ రెడ్డి →

బుక్కాపురంలో..



వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పార్టీ నాయకులు

మహానంది: బుక్కాపురం రైతు భరోసా కేంద్రం వద్ద వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పార్టీ మండల అధ్యక్షుడు కొమ్మాపాల మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించాచరు. ముందుగా వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం యువత పోరు కార్యక్రమానికి నంద్యాలకు తరలి వెళ్లారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మహేశ్వర రెడ్డి, నాయకులు కొండా మధుసూదన్ రెడ్డి, బండి శ్రీనివాసులు, కందుల రఘురామిరెడ్డి, ఉపసర్పంచ్ ప్రతాప్ రెడ్డి, శరభా రెడ్డి, సాగేశ్వర రెడ్డి, కుమ్మరి శివయ్య, అబ్బీపురం రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం కోసమే...

నందికొట్కూరులో..



నందికొట్కూరు పాత బస్టాండ్ వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించిన పట్టణ అధ్యక్షులు మన్సూర్

నందికొట్కూరు: ప్రజా సంక్షేమం కోసమే వైఎస్సార్‌సీపీ ఆవిర్భవించిందని ఆ పార్టీ పట్టణ అధ్యక్షులు మన్సూర్ తెలిపారు. బుధవారం పట్టణంలో పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించారు. మండల వ్యాప్తంగా కేక్ కట్ చేసి పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ షేక్ నాయబ్, వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకులు పుల్యాల నాగిరెడ్డి, రమేష్‌నాయుడు, అబుబక్కర్, ఉపేంద్రారెడ్డి, రమణ, జబ్బార్, కోకిల రమణారెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, విజ్జి, లడ్డూ, లక్ష్మిరెడ్డి, రవి, రాజు, చరణ్, రహంతుల్లా, నాగరాజు, శెట్టి శివ, లింగస్వామి పాల్గొన్నారు.

కొత్తపల్లిలో..



వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

కొత్తపల్లి: మండలం కేంద్రంలో వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ కె.సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా పార్టీ జెండాను ఆవిస్కరించారు. కార్యక్రమంలో కో ఆప్టెడ్ మెంబర్ మహమ్మద్ గౌస్, సింగల్ విండో మాజీ చైర్మన్ జనార్దన్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ మహబూబ్ బాషా, ఎంపీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస రెడ్డి, నాయకులు నారాయణ రెడ్డి, రవీంద్రారెడ్డి, రహంతుల్లా, రమేష్ బాబు, లింగారెడ్డి, పరశురాముడు, కృష్ణుడు, నంద్యాల ఉస్మాన్, రామలింగారెడ్డి పాల్గొన్నారు.

పారుమంచాలలో..

జూపాడుబంగ్లా: మండల పరిధిలోని పారుమంచాలలో వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పారుమంచాల మార్కెట్‌యార్డు మాజీ డైరెక్టర్ నాగరత్నం, వార్డుమెంబర్ జాకీర్ తదితరులు గాంధీసెంటర్‌లో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. జగనన్న హయాంలో రైతుభరోసా, అమ్మఒడి, విద్యాదీవెన, వసతిదీవెన, పంట నష్టపరిహారం అందేదని, కూటమి ప్రభుత్వం వాటన్నింటికీ కోత విధించి అన్ని వర్గాలనూ మోసం చేసిందన్నారు.



సైనికుల్లా పనిచేయాలి



పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న

పగిడ్యాల: వైఎస్సార్‌సీపీ అభివృద్ధికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షులు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పుల్యాల నాగిరెడ్డి, సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న సూచించారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బస్టాండ్‌లో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యకర్తలు మిఠాయిలు పంపిణీ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నాగేశ్వరరెడ్డి, గోవిందరెడ్డి, మద్దిలేటి రెడ్డి, గొల్ల శేషన్న, కోటేశ్వరరావు, నీలకంఠేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

చెంచుల గృహ నిర్మాణాలకు అదనపు సాయం

శ్రీశైలంప్రాజెక్ట్: చెంచుగిరిజనుల గృహ నిర్మాణాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అదనంగా రూ.1 లక్ష కేటాయించినట్లు శ్రీశైలం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కె.వి.శివప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం నిరుపేదల గృహ నిర్మాణాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.2,39,000 ఇస్తోందని, గిరిజన గూడేలు మైదాన ప్రాంతాలకు దూరంగా ఉన్న కారణంగా ఇంటి నిర్మాణ సామగ్రి రవాణా ఖర్చును దృష్టిలో ఉంచుకుని మరో రూ.1 లక్ష అదనంగా మంజూరు చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు వచ్చినట్లు పీఓ తెలిపారు. ప్రధానమంత్రి జన్‌మన్ పథకం కోసం శ్రీశైలం ఐటీడీఏ పరిధిలోని ప్రకాశం, నంద్యాల, పల్నాడు చెంచుగిరిజనులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. అదనపు ఆర్థిక సాయం పొందేందుకు సచివాలయాల్లోని ఇంజినీరింగ్ అసిస్టెంట్, మండల స్థాయిలోని హౌసింగ్ అసిస్టెంట్ ఇంజినీర్‌ను సంప్రదించాలన్నారు.

పాఠశాలలో మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం



ఆర్ఓ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల కోసం కోరోమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ జోనల్ మేనేజర్ దామోదర్ నాయుడు, జోనల్ మార్కెటింగ్ మేనేజర్ కిషోర్, ఏరియా మేనేజర్ సుబ్బారెడ్డి, జోనల్ హెచ్ఆర్ మహేష్ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో రైతులకు చేయూతగా రసాయన ఎరువులు, పురుగు మందులు, అందిస్తున్న తమ సంస్థ విద్యార్థుల ఆరోగ్యాన్ని ప్రోత్సహించాలనే లక్ష్యంతో పాఠశాలలో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో కొత్తపల్లి గ్రోమోర్ మేనేజర్ నాగశేషులు, మాజీ సర్పంచ్ శ్రీనాథ రెడ్డి తదితదరులు పాల్గొన్నారు.

టీబీ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

పాములపాడు: టీబీ రహిత సమాజాన్ని నిర్మించేందుకు అందరూ కృషి చేయాలని టీబీ యూనిట్ సూపర్‌వైజర్ చెరకు రవికుమార్ అన్నారు. బుధవారం మండలంలోని ఇస్కాల గ్రామంలో క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సిబ్బంది సలహాలను తీసుకోవాలని చెప్పారు. పోషకాహార లోపం ఉంటే వయస్సు లింగ తారతమ్యం లేకుండా టీబీ బారిన పడే అవకాశం ఉందన్నారు. వ్యాధి లక్షణాలను వివరించారు. లక్షణాలు కనిపిస్తే ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా గళ్ల పరీక్ష నిర్వహించి వ్యాధి నిర్ధారణ చేస్తారని, అవసమైతే మందులు కూడా ఉచితంగా ఇవ్వనున్నట్లు చెప్పారు. ధూమపానం, మద్యపానం, గుట్కా, ఖైనీ అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచు మౌలాలి, ఎంఎల్‌హెచ్‌పీ సింధూర, కార్యకర్తలు భరత్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు పారుమంచాలలో లేగదూడల ప్రదర్శన

జూపాడుబంగ్లా: మండలంలోని పారుమంచాల గ్రామంలో గురువారం మేలుజాతి లేగదూడల ప్రదర్శన ఉంటుందని పశుసంవర్ధకశాఖ ఏడీ రామాంజనేయనాయక్ బుధవారం తెలిపారు.

సారా జోలికెళ్లొద్దు

నందికొట్కూరు: నాటు సారా తాగి అనారోగ్యాలకు గురి కావద్దని ఎక్సైజ్ ఎస్‌ఐ జఫ్రుల్లా సూచించారు. బుధవారం కొణిదేల గ్రామంలో 2.0 నవోదయ కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

ఎస్సీ వర్గీకరణను త్వరగా చేపట్టాలి

కొత్తపల్లి: ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణను రాష్ట్ర ప్రభుత్వం త్వరగా చేపట్టాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కనక నాగన్న బుధవారం డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మిట్ట కందాల రామకృష్ణ, కొండే పోగు నాగరాజు, బుడగ జంగాల నాయకులు సిరువాటి జమ్మన్న తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే సహించం



ఫిర్యాదుదారులను విచారిస్తున్న ఏపీడీ అన్వరాబేగం

జూపాడుబంగ్లా: ఫీల్డ్‌అసిస్టెంట్లు, సీనియర్‌మేట్లు ఎవ్వరైనా అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేదిలేదని ఆత్మకూరు ఏపీడీఓ అన్వరాబేగం హెచ్చరించారు. భాస్కరాపురం సీనియర్ మేట్ బి.నరసింహపై వచ్చిన ఫిర్యాదుల ఏరకు ఆమె బుధవారం గ్రామానికి చేరుకుని విచారించారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు ఏపీడీ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గొల్ల మాధవి, ఏపీఓ గౌరీబాయి పాల్గొన్నారు.

'యువత పోరు'కు తరలిన కార్యకర్తలు

ఆత్మకూరు: నంద్యాల జిల్లా కేంద్రంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన యువత పోరు కార్యక్రమానికి ఆత్మకూరు నుంచి పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్లాయి. పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు రాజమోహన్‌రెడ్డి, సయ్యద్‌మీర్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు.

అలరించిన హరికథాగానం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై కడప జిల్లా మైదుకూరుకు చెందిన వై.నాగరాజు భాగవతార్ వారి శివగాథాలహరిపై హరికథ గానం నిర్వహించారు. తబల సహకారాన్ని తిరుపతి, వయోలిన్ సహకారాన్ని భరద్వాజ్ అందించారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేసుకోండి

ఆత్మకూరు: గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని ఎంపీడీఓ నాగభూషణంశెట్టి లబ్ధిదారులకు సూచించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ బీసీ, ఎస్సీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు, చెంచులకు రూ.లక్ష చొప్పున అదనంగా అందిస్తామన్నారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకని గృహాలను వేగవంతంగా పూర్తి చేసుకోవాలన్నారు. అదనపు ఆర్థిక సాయం కోసం కుల ధ్రువీకరణ పత్రాలతోపాటు ఆధార్ కార్డు, గ్రామీణ లబ్ధిదారులు పొజిషన్ సర్టిఫికెట్ల జిరాక్స్‌లను సచివాలయాల్లో సమర్పించాలన్నారు.

గృహ లబ్ధిదారులకు అదనపు ఆర్థిక సాయం

వెలుగోడు: మండలంలో గృహ లబ్ధిదారులకు అదనపు ఆర్థికం మంజూరు చేసినట్లు జిల్లా గృహ నిర్మాణ శాఖ ఈఈ వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం ఆయన స్థానిక హౌసింగ్ లేఅవుట్‌లో లబ్ధిదారులతో సమావేశమై మాట్లాడారు. గతంలో ఇచ్చిన బిల్లులకు అదనంగా ఎస్సీ, బీసీలకు రూ.50,000, ఎస్టీలకు రూ.75000, చెంచులకు రూ.లక్ష ప్రభుత్వం ఇస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస గౌడ్, హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు, ఏపీఓ మల్లికార్జున పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



షేక్ మూర్తుజావలి(ఫైల్)

ఆత్మకూరురూరల్: మండలంలోని కృష్ణాపురం గ్రామంలో మంగళవారం రాత్రి షేక్ మూర్తుజావలి(25) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. గ్రామానికి చెందిన షేక్ ముర్తుజావలి ఏదో పనిపై వెళ్లి కాస్త ఆలస్యంగా ఇంటికి చేరాడు. స్నానం చేసి తడిసిన టవల్‌ను ఇంటి ముందు ఉన్న తీగపై ఆరేసే ప్రయత్నం చేశాడు. ఇనుప తీగకు విద్యుత్ వైర్ తగలడంతో అందులో విద్యుత్ ప్రవహిస్తూ విద్యుదాఘాతంతో షేక్ ముర్తుజావలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య ప్రస్తుతం ఐదు నెలల గర్భిణి.

భూసార పరీక్షలు చేయించుకోవాలి




ఎర్రమఠం సమీపంలో రైతుకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారులు

కొత్తపల్లి: రైతులు పంటలను సాగుచేసుకునే ముందు భూ సార పరీక్షలు చేయించుకోవాలని ఏఓ మహేష్ సూచించారు. బుధవారం మండలంలోని ఎర్రమఠం, ముసలిమడుగు గ్రామాల పంటపొలాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగుకు ముందు రైతులు భూసార పరీక్షలు చేయిస్తే నేలను బట్టి పంటల రకాలను సాగు చేసుకోవచ్చన్నారు. అధిక దిగుబడి, తెగుల్ల నివారణ కూడా సాధ్యమవుతుందన్నారు. వేసవిలో లోతు దుక్కులు దున్నుకోవడంవల్ల వర్షపునీరు భూమిలో ఇంకి తేమ, నీటి నిలువ శాతాన్ని పెంచుతుందన్నారు. ప్రతి రైతు పంటమార్పిడి విధానాన్ని పాటించాలన్నారు.

ప్రకృతి వనరులను ఉపయోగించుకోవాలి

పాములపాడు: ప్రకృతి వనరులను ఉపయోగించుకుని నాణ్యమైన పంటలను ఉత్పత్తి చేయాలని మండల వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డి సూచించారు. బుధవారం పాములపాడు, రుద్రవరం గ్రామాల సమీపంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ యాంత్రీకరణ కింద ట్రాక్టర్ సామాన్లు కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రాల్లో వినియోగించుకోవాలన్నారు. ప్రతి రెండు సీజన్లకోసారి జింక్‌సల్ఫేట్ వాడుకోవాలన్నారు. పచ్చిరొట్ట ఎరువులను పంట సాగుకు ముందు సాగు చేసి భూమిని సారవంతం చేసుకోవాలన్నారు.

అండర్‌పాస్ వంతెన వద్దంటూ నిరసన



కేజీ రోడ్డుపై ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

పాములపాడు: మండలంలోని యర్రగూడూరు గ్రామంలో నేషనల్‌హైవే 340సీ నిర్మాణంలో భాగంగా అండర్‌పాస్ వంతెన నిర్మాణం వద్దని గ్రామస్తులు బుధవారం కేజీ రోడ్డుపై రాస్తారోకో చేశారు. ఎన్‌హెచ్ అలైన్‌మెంటులో లేని అండర్ పాస్ వంతెనను ఎలా నిర్మాణం చేపడతారని ప్రశ్నించారు. ఎన్‌హెచ్ సేఫ్టీ కమిటీ సూచనలను పక్కన పెట్టి గ్రామంలో అండర్ పాస్ వంతెన నిర్మాణానికి మొగ్గు చూపడం ఎంత వరకు సమంజసమన్నారు. ప్రజల మాటలను పెడ చెవిన పెట్టి స్వార్థ రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి వంతెన నిర్మాణానికి పూనుకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నిర్మాణ రహదారిలో ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు నాగార్జునరెడ్డి, కమలాకర్, రాజన్న, రమేష్‌నాయక్, వడ్డె నాయక్, లింగేశ్వరగౌడు, శివనాయక్, విశ్వనాథ్, శ్రీనివాసులు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

14న తిరుమలకు పాదయాత్ర

పాములపాడు: ఈనెల 14న పాములపాడు నుంచి తిరుమల తిరుపతికి పాదయాత్రగా భక్తులు బయలుదేరి వెళ్లనున్నట్లు భజన మండలి సభ్యులు జంబులయ్య బుధవారం తెలిపారు. కాలినడకన శ్రీవారి దర్శనార్థమై బయల్దేరే భక్తులు తిరుమలకు చేరుకోవడానికి 10 రోజులు సమయం పడుతుందని, అందుకు తగ్గట్లుగా సిద్ధం కావాలని తెలిపారు. మిడుతూరు మండల కేంద్రం నుంచి, జూపాడుబంగ్లా, తూడిచెర్లకు వందల సంఖ్యలో భక్తులు వస్తారని, పాములపాడు నుంచి వెళ్లి అక్కడే వారితో కలిసి నడక ప్రారంభిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 7995847145, 9550377533 నంబర్లను సంప్రదించాలన్నారు.

పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ

పగిడ్యాల: మండలంలోని నెహ్రూనగర్ జిల్లా పరిషత్‌ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్న 56 మంది విద్యార్థులకు బుధవారం బాలకృష్ణ సేవాసమితి అధ్యక్షుడు బందారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో పరీక్షా ప్యాడ్, పెన్నులు, పెన్సిళ్లను పంపిణీ చేశారు.